క్లుప్తంగా

శిక్షా సప్తాహ్ కార్యక్రమం


మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీవాణి

పుంగనూరు: ప్రభుత్వ పాఠశాలలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని కల్లూరు హైస్కూల్‌లో హెచ్‌ఎం శ్రీవాణి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్థానికంగా లభించే వనరులతో బోధనకు ఉపయోగపడేలా అవగాహన కల్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ 7 రోజుల పాటు జరిగే శిక్షాసప్తాహ్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తామన్నారు. దీని ద్వారా విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞావంతులుగా తయారవుతారని తెలిపారు.

శిక్షాసప్తాహ్ వారోత్సవాలు


వారోత్సవాలను నిర్వహిస్తున్న అధికారులు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె హైస్కూల్‌లో శిక్షాసప్తాహ్ వారోత్సవాలను సోమవారం విద్యాశాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 29 దాకా మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

వార్డు సభ్యుడికి ఆర్థిక సాయం


మునెమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ రెడ్డెప్ప

బైరెడ్డిపల్లి: మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ వార్డు సభ్యుడు సుబ్రమణ్యం తల్లి మునెమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప గ్రామానికి వెళ్లి మునెమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. సుబ్రమణ్యం, కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.30వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచులు రవిచంద్రబాబు, వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నేతలు ప్రభాకర్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, మహేష్ పాల్గొన్నారు.

ఫీల్డ్‌అసిస్టెంట్ల తొలగింపు అన్యాయం


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఓబుల్‌రాజు

పలమనేరు: కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షతో జిల్లాలోని వెయ్యిమంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం అన్యాయమని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ నేత ఓబుల్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం దీనిపై గ్రీవెన్స్‌లో కలెక్టర్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ల తరపున పోరాటానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా


బోల్తా పడ్డ ట్రాలీ

సదుం: అదుపు తప్పి ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడ్డ సంఘటన మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. నాయన పాకాల పోతంవారిపల్లె నుంచి టమాటా బాక్స్‌లతో ట్రాక్టరు కలికిరి మార్కెట్టుకు బయల్దేరింది. పాత పోలీస్ స్టేషన్ వద్ద అదుపుతప్పి ట్రాక్టరు ట్రాలీ బోల్తా పడింది. రోడ్డు పక్కన ఉన్న దుకాణాలు ఉండడంతో వాటిపై టమాటా బాక్స్‌లు పడ్డాయి. రాత్రి కావడంతో దుకాణాల వద్ద పెద్దగా జన సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. టమాటాలు నేలపాలయ్యాయి.

నేటి నుంచి సీఎం సతీమణి కుప్పం పర్యటన

కుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి మూడు రోజులపాటు కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మంగళవారం నుంచి గురువారం వరకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో టీడీపీ అధికంగా ఓట్లు వచ్చిన గ్రామాల్లో ఆమె పర్యటిస్తున్నట్లు తెలిపారు. గుడుపల్లె మండలం కంచిబందార్ల పల్లి, కుప్పం మండలం పైపాళ్యంలో అధికంగా టీడీపీ మెజారిటీ రావడంతో ఆ గ్రామాలను ఆమె దత్తత తీసుకుంటారని వారు తెలిపారు.

తాగునీటికి రోడ్డెక్కిన మహిళలు


గుడికొత్తూరు గ్రామంలో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

గుడుపల్లె: తాగునీటి కోసం మహిళలు సోమవారం ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. మండలంలోని గుడికొత్తూరు గ్రామంలోని వారం రోజులుగా మంచి నీటి కోసం అవస్థలు పడుతున్నా కూడాఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నీటికి కోసం తీవ్ర ఇబ్బందులు పడలేక ఖాళీ బిందెలు తీసుకుని రోడ్డుపై బైఠాయించారు. గ్రామంలోని బోరుల్లో నీరు వచ్చేంత వరకు రోడ్డుపైనే ఉంటామని భీష్మించుకున్నారు. బోర్లు మరమ్మతులకు గురైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రిపేరు చేయడానికి కాలయాపన చేస్తున్నారన్నారు. దీంతో కొంత మంది గ్రామ పెద్దలు అధికారులతో చర్చించి రెండు రోజుల్లోపు గ్రామానికి మంచి నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళనను విరమించారు.

భారీగా చెట్ల నరికివేత


నరికివేతకు గురైన చెట్లు

కుప్పం రూరల్: కుప్పం మండలం, మోట్లచేను గ్రామంలో కొంత మంది అక్రమార్కులు భారీ ఎత్తున చెట్లను నరికివేశారు. చెట్లు అటవీ ప్రాంతంలో ఉన్నా పట్టించుకోకుండా నేలకూల్చారు. స్థానికులు వెళ్లి అడ్డుకున్నా, వారిపై దౌర్జన్యానికి దిగి నారా దుర్భాషలాడారు. మోట్లచేను గ్రామం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఏపుగా తైలం చెట్లు ఉన్నాయి. ఎప్పటి నుంచో అక్రమార్కులకు ఈ చెట్లపై కన్ను ఉంది. చెట్లు ఏపుగా పెరగడంతో ప్రస్తుతం పట్టపగలే అక్రమార్కులు చెట్లను నరికేందుకు పూనుకున్నారు. స్థానికులు అడ్డుకుని అటవీ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందన లేకపోయింది. దీంతో అక్రమార్కులు, స్థానికుల మధ్య గొడవలు సైతం చోటు చేసుకున్నాయి.

భోజనంలో నాణ్యత తప్పనిసరి


వంటగదిని పరిశీలిస్తున్న యాదవపతి, పీఎస్ నాగరాజు

వి.కోట: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతను తప్పనిసరిగా పాటించాలని పంచాయితీ కార్యదర్శి యాదవపతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గది, కూరగాయలను, పాత్రలు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పారిశుద్ధ్యం లోపించడం వల్ల దోమలు వ్యాప్తి చెంది విషజ్వారాలు ప్రబలుతున్నాయన్నారు. వంట గది, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నాణ్యమైన కూరగాయలను వినియోగించాలని, వంట వండిన తర్వాత పాత్రలు ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని ఆదేశించారు.

తిరుపత్తూరుకు బస్సు సౌకర్యం కల్పించండి


బస్సు సౌకర్యం కోసం విన్నవిస్తున్న మల్లానూరు ప్రాంతవాసులు

కుప్పం రూరల్: కుప్పం నుంచి తిరుపత్తూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని మల్లానూరువాసులు సోమవారం ఆర్టీసీ సీఐ లక్ష్మణరావుకు విన్నవించారు. కుప్పం నుంచి గరిగచీనేపల్లి, మల్లానూరు, అడవిబూదుగూరు మీదుగా తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. బస్సు సర్వీసు నడిపితే మల్లానూరు ప్రాంతవాసులకు ఎంతో అనుకూలంగా ఉంటుందని వారు తెలిపారు. దీనిపై స్పందించిన ఆర్టీసీ సీఐ లక్ష్మణరావు ఉన్నతాధికారులకు సమస్యను నివేదించి, త్వరలో బస్సు సర్వీసు నడిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కార్యకర్తలకు అండగా వైఎస్సార్‌సీపీ


కార్యకర్తలకు చెక్‌లు అందిస్తున్న కృష్ణమూర్తి

బైరెడ్డిపల్లె: టీడీపీ, జనసేన కార్యకర్తల దాడిలో నష్టపోయిన వైఎస్సార్‌సీపీ కుటుంబాలకు పార్టీ ఆర్థిక సాయం అందించింది. సోమవారం ఈ మేరకు మండలంలోని గడ్డిండ్లులో రామకృష్ణప్ప, లక్ష్మీపతికి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం పంపించిన రూ.50వేల చెక్కులను పార్టీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడతూ కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, త్వరలోనే దానికి చరమగీతం పాడే రోజులు వస్తాయని వెల్లడించారు. కార్యకర్తలు అధైర్యపడొద్దని, అందరం వెన్నంటే ఉంటామని భరోసా ఇచ్చారు. బాధితులకు పార్టీ వెన్నదన్నుగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు


పెద్దమల్లెల పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

రొంపిచెర్ల: పెద్దమల్లెల ప్రాథమిక పాఠశాలలో 55 మంది విద్యార్థులకు కంటి, దంత వైద్య పరీక్షలను ఉచితంగా చేసినట్లు ఎంఈఓ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ కంటి చూపుపై నిర్లక్ష్యం చేయరాదన్నారు. సమాజంలో లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పామిడి మహేష్ గుప్త, కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, కోశాధికారి చెంగయ్య, సభ్యులు శశిధర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ


నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్ దయానందరాజు

పుంగనూరు: పట్టణంలోని బసవరాజ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఒకొక్కరికి 12 నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. సోమవారం ప్రిన్సిపల్ దయానందరాజు ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 382 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని, ఉన్నత పౌరులుగా స్థిరపడాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు నివాళి


హాఫీజ్ కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: పట్టణంలోని 11 వవార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త హాఫీజ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ సోమవారం హాఫీజ్ మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబానికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన డిగ్రీ విద్యార్థులు

కుప్పం రూరల్: ఎస్వీయూ విడుదల చేసిన డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాల్లో కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ పాయింట్లు సాధించినట్లు చైర్‌పర్సన్ శాంతా నాగరాజు చెప్పారు. బీఎస్సీ(సీఏ)లో సుహర్షిత 9.5, అర్షియా 9.3, బీఎస్సీ(ఎంపీజీ)లో భవాని 9.4, అర్చనా 9.1, బీఎస్సీ (ఎంఎస్‌జీ) భువనేశ్వరి 9.4, గుణవతి 8.7 సాధించినట్లు చెప్పారు. బీఎస్సీ(బీ జెడ్‌సీ)లో ప్రవల్లిక 8.8, నిత్యలక్ష్మీ 8.5, బీబీఏలో గంగోత్రి 8.7, కిరణశ్రీ 8.1 పాయింట్లు సాధించినట్లు ఆమె తెలిపారురు. అదే విధంగా అడ్వాన్స్‌డ్ అకౌంటింగ్‌లో ముగ్గురు విద్యార్థులు 10కి 10, ఫిజిక్స్‌లో ఇద్దరు విద్యార్థులు 10కి 10, మ్యాథ్స్‌లో ముగ్గురు విద్యార్థులు 10కి 10 పాయింట్లు సాధించినట్లు చెప్పారు. విద్యార్థులకు కళాశాల చైర్‌పర్సన్ శాంతానాగరాజు, ప్రిన్సిపల్ సుధారాణి అభినందనలు తెలిపారు.

శివాలయానికి స్టాండ్ వితరణ


స్టాండును అందిస్తున్న దాత

పలమనేరు: పట్టణంలోని గంటావూరుకు చెందిన మురుగన్ అనే భక్తుడు స్థానిక శివాలయానికి రూ.50వేల విలువైన స్టాండును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ అర్చకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

రాయితీ ధరతో పశుగ్రాసం విత్తనాలు


చౌడేపల్లెలో రైతులకు జొన్న, మొక్కజొన్న విత్తనాలను పంపిణీ

చౌడేపల్లె: ప్రభుత్వం రాయితీ ధరలతో పశుగ్రాసం విత్తనాలను పంపిణీ చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక పశువైద్య కేంద్రం ఆవరణంలో టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రెడ్డితో కలిసి రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. మండలానికి 8500 కేజీల మొక్కజొన్న విత్తనాలు, 520 కేజీల జొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మొక్క జొన్న విత్తనాలు కేజీ రూ.17 చొప్పున జొన్న విత్తనాలు కేజీ రూ.23 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు చంద్రమౌళి, గిరిరాజు, సుబ్రమణ్యం, పవన్, హమీద్‌ఖాన్, గుంగులప్ప, ప్రభాకర్, భాస్కర్ రెడ్డి తదితరులున్నారు.

ప్రకృతి సేద్యంపై దృష్టి

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని నగరి డివిజన్ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప తెలిపారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో క్రిష్ణజమ్మపురం యూనిట్‌లోని గ్రామ సంఘం అధ్యక్షులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పుష్ప మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో చెరకు సాగు చేస్తే అందులో వస్తున్న బెల్లం తీసుకోవడానికి టీటీడీ సిద్ధంగా ఉందని తెలిపారు. జీవామృతం, కషాయాలతో సాగు చేయడంపై అవగాహన కల్పించారు.

పారదర్శకంగానే లావాదేవీలు


మాట్లాడుతున్న ఏజెన్సీల నిర్వాహకులు

పలమనేరు: బాలాజీ సూపర్ బజార్‌తో పారదర్శకంగా లావాదేవీలు సాగిస్తున్నామని, నిర్వాహకులకు ఎలాంటి కమీషన్లు ఇవ్వడం లేదని డిస్ట్రిబ్యూటర్ల సంఘం సభ్యులు తెలిపారు. సోమవారం పట్టనంలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో వారు విలేకర్లతో మాట్లాడారు. సూపర్ బజార్ అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్‌పై టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు అసత్యమని స్పష్టం చేశారు. సూపర్ బజార్‌కు అవసరమైన సరుకులను 24 మంది ఏజెన్సీల వారు సరఫరా చేస్తున్నారని, బిల్లుల చెల్లింపులు బ్యాంకు ఖాతాల ద్వారానే సాగుతున్నాయని వివరించారు. ప్రజలకు తక్కువ ధరలకే నిత్యావసర వస్తువులందిస్తున్న సూపర్‌బజార్ నిర్వాహకులకు తాము ఎలాంటి కమీషన్లు ఇవ్వడం లేదన్నారు. మంచి సేవలందిస్తూ లాభాల్లో ఉన్న సూపర్ బజార్‌పై టీడీపీ నేతలు లేనిపోని నిందలను వేయడం సరికాదన్నారు. సమావేశంలో డిస్ట్రిబ్యూటర్ల సంఘం అధ్యక్షుడు నాగేంద్ర పాల్గొన్నారు.

శివాడిలో 'ఫ్యామిలీ డాక్టర్'


రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి మురళి

పెద్దపంజాణి: మండలంలోని శివాడి గ్రామంలో సోమవారం పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.మురళి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలు, బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో అడిగి తెలుసుకుని సలహాలు అందించారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, రక్తహీనత నివారణ కోసం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా తెరలు వాడాలని, కిటికీలకు మెష్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ జమున, ఏఎన్‌ఎం సుశీల, ఆశ వర్కర్లు ఉమా, చాన్‌బీ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


మీర్జేపల్లెలో నీటి నిల్వలపై దోమల మందు పిచికారీ

పుంగనూరు: మండలంలోని మీర్జేపల్లె గ్రామంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజశ్రీ, సూపర్‌వైజర్లు హరినాథరెడ్డి, ఆనంద్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ, మురుగునీటి కాలువలను శుభ్రం చేయించి, నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలలో బ్లీచింగ్, ఫినాయిల్ పిచికారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా, దోమలు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరు నీటిని కాచి, వడపోసి తాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది అపర్ణ, వనిత తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో చోరీ


హుండీ చోరీ అయిన ఆలయం

చౌడేపల్లె: ఆమినిగుంట గ్రామసమీపంలో నూతనంగా నిర్మించిన గ్రామదేవత బోయకొండ గంగమ్మ, మారెమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీ ఆదివారం చోరీకి గురైంది. సోమవారం పూజలు చేసేందుకు వెళ్లిన మహిళలు గుర్తించి గ్రామస్తులకు తెలియజేశారు. ఆలయ ప్రధాన గేటు తాళాలు పగులకొట్టి హుండీని ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. హుండీలో రూ.15 వేల వరకు నగదు ఉంటుందన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ఐఆర్‌ఎం విద్యార్థుల ప్రతిభ


కావేరి, త్రిషా, మనీషా, హీనా కౌసర్

కుప్పం: ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో సోమవారం విడుదలైన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కుప్పం ఐఆర్‌ఎం కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు చైర్మన్ దయానిధి తెలిపారు. బీకాం గ్రూపులో కావేరీ 9.5 పాయింట్లు, బీఎస్సీలో త్రిష 9.4, బీబీఏ గ్రూపులో హీనాకౌసర్ 8.6 పాయింట్లు సాధించి కళాశాలను ప్రథమ స్థానంలో నిలిపారని తెలిపారు. మనీషా 9.2 తులసి 9.1 పవిత్ర 7.9 రిషియా 7.4 జీవిత 8.1 , తబుస్సం 7.9 పాయింట్లు సాధించి ప్రతిభ కనబరచినట్లు ఆయన తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

డిగ్రీ సెమిస్టర్‌లో మదర్‌థెరిస్సా విద్యార్థుల ప్రతిభ


పూజిత, లోకేష్‌రెడ్డి, హారిక, రాజేష్
ఎంవీఆర్‌లో..

గంగవరం: ఎస్వీయూ విడుదల చేసిన డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాల్లో మండలంలోని మదర్‌థెరిస్సా కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచినట్లు కరెస్పాండెంట్ రవీంద్రబాబు సోమవారం తెలిపారు. బీఎస్సీలో రోహిణి (9.55), అశ్విని (9.49), సమీరా (9.38), పూజిత(9.29), మౌనిక (9.19), బీసీఏలో కావ్యశ్రీ (9.49), సమీరా (9.23), బీకామ్‌లో కుసుమ (9.15), స్నేహ (9.14), మైత్రి (9.08), చందన (9.05), బీబీఏలో లోకేష్‌రెడ్డి (9.17) జీఎస్‌జీపీఏ సాధించి యూనివర్సిటీ టాపర్స్‌గా నిలిచారన్నారు. బీఎస్సీ, బీసీఏ, బీకామ్, బీబీఏఏలో రెండవ సంవత్సరం మూడో సెమిస్టర్‌లో 230 మంది డిస్టింక్షన్లు, 120 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు వివరించారు. సత్తా చాటిన విద్యార్థులను కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ మధుసూదన్‌రావు అభినందించారు.

డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాల్లో ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కరెస్పాండెంట్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బీఎస్సీలో పావని(9.64), గౌతమి (9.27), నందిని (9.20), బీకామ్‌లో రాజేష్ (9.60), లావణ్య (9.14), ముస్కాన్‌భాను (8.83), రెడ్డిరాణి (8.72), బీబీఏలో హారిక (9.07), మధురవాణి(9.07), తేజస్విని (9.00), బీజెడ్‌సీలో (రూప(8.08) జీఎస్‌జీపీఏ సాధించినట్లు వివరించారు. విద్యార్థులను ప్రిన్సిపల్ లక్ష్మీసుధ, డైరెక్టర్లు ప్రమోద్‌కుమార్, కిషోర్‌కుమార్ అభినందించారు.

కలశ స్థాపనకు సహకరించండి


గ్రామస్తులతో కలిసి సమస్యలపై చర్చిస్తున్న దాత ఎస్‌కే రమణారెడ్డి

చౌడేపల్లె: బజారువీధిలోని శ్రీరుక్మిణి సమేత సత్యభామ వేణుగోపాలస్వామి ఆలయంలో త్వరలో జరగనున్న కలశ స్థాపనకు గ్రామస్తుల సహకారం అవసరమని దాత ఎస్‌కే రమణారెడ్డి కోరారు. రెండు రోజులుగా ఆలయంలో దగ్గర నెలకొన్న సమస్యలపై ఆయన గ్రామస్తులతో కలిసి పరిశీలించి చర్చించారు. ఆలయం పక్కనే ఉన్న నివాసగృహాలకు దారి సౌకర్యం, సమస్యగా మారిన సిమెంటు రోడ్డు తొలగింపు అంశాలపై గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. ఈ సమస్యలను గ్రామస్తులు అందరూ ఐకమత్యంతో పరిష్కరించి, ఎలాంటి సమస్యలు లేకుండా ఆలయ అభివృద్ధికి అందరం కలిసి పాటుపడదామని కోరారు. ఆయన వెంట నేతలు నాగరాజ, నాగభూషణాచారి, మనోహర్, కేశవులు తదితరులున్నారు.